ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 11.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ఈ రోజు ప్రమాణస్వీకారం చేసారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

2. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ రోజు కొట్టివేశారు.

3. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

4. మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్ లో భాగంగా భారత్ ఈరోజు వేల్స్ తో తలపడనుంది.

------------------------------

**గవర్నర్ ప్రమాణస్వీకారం**

తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణస్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో జరిగిన ఈ వేడుకలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. గవర్నర్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేసారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు.

వీరితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

**బైట్ - గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

**MSM/RNU**

-------------------------

**గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం**

ఆసిఫాబాద్ జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలోని ఎల్లారంలో నిర్వహించిన నివారణ టీకాల కార్యక్రమంలో జిల్లా అధికారి సురేష్ కుమార్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 10 నుండి వచ్చేనెల 9వ తేదీ వరకు జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 15 మండలాల్లో ఆవులు, ఎడ్లు 2 లక్షల 32 వేలు ఉండగా, గేదెలు 41 వేలకు పైగా ఉన్నాయని, గ్రామాల్లో నెలరోజులపాటు ప్రత్యేక కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు.

**పీటీసీ – ఆసిఫాబాద్**

**--------------------------------**

**సౌరవిద్యుత్**

సౌరవిద్యుత్ ఉత్పత్తితో లాభాలు పొందవచ్చునని ఖమ్మం జిల్లా సూపరింటెంట్ ఆఫ్ ఇంజనీర్ శ్రీనివాసచారి చెప్పారు. ఈరోజు తిరుమలాయపాలెం మండలంలోని జూపెడ గ్రామంలో పీఎం-కుసుమ్ కిసాన్ పథకంలో భాగంగా 2.0 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా జూపెడ గ్రామానికి చెందిన బీరావల్లి శ్రీనివాసరావుకు చెందిన సోలారు ప్లాంట్ ను ప్రారంభించామని పేర్కొన్నారు. సౌరవిద్యుత్

ప్లాంట్ ద్వారా పర్యావరణానికి హానీ లేకుండా స్వచ్ఛమైనా విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేయడం ద్వారా రైతుకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు.

**పీటీసీ – ఖమ్మం**

----------------------------

**వైద్య ఆరోగ్య శాఖ నియామక బోర్డు**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సర్వీసుల నియామక బోర్డు (MHSRB) నిన్న 692 మందితో కూడిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్ స్పెషలిస్ట్ పోస్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించగా, మిగిలిన విభాగాల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపికను 1:1.5 నిష్పత్తిలో చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని వెంగళ్‌రావునగర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతుంది. ఒకవేళ నిర్ణీత తేదీల్లో హాజరు కాలేని వారికి మార్చి 16న తమ సర్టిఫికెట్లను సమర్పించేందుకు చివరి అవకాశం కల్పించారు. అర్హులైన అభ్యర్థుల వివరాల కోసం బోర్డు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

**డెస్క్**

----------------------

**అమృత్‌భారత్ ఎక్స్ ప్రెస్ రైలు**

అస్సాం, తెలుగు రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని పెంచుతూ మార్చి 13న అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానుంది. అస్సాంలోని కామాఖ్య నుంచి చర్లపల్లి వరకు నడిచే ఈ రైలులో కేవలం స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈశాన్య ప్రాంతాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో నాణ్యమైన సేవలు అందించడమే ఈ రైలు ప్రధాన లక్ష్యమని తెలిపింది.

**డెస్క్**

----------------------------------

**కవిత దీక్ష**

ఖమ్మం వెలుగుమట్ల భూ బాధితులకు అండగా నిలుస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మూడో రోజుకు చేరుకుంది. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో ఈ దీక్ష కొనసాగుతోంది. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలని, ప్రభుత్వం కూల్చివేసిన ఇళ్ల స్థానంలోనే తిరిగి కొత్త నివాసాలను నిర్మించి ఇచ్చే వరకు తన పోరాటం ఆగదని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ హామీ లభించేంత వరకు దీక్షను విరమించే ప్రసక్తే లేదని ఆమె అన్నారు.

**పీటీసీ – హైదరాబాద్**

----------------------------------

**అనర్హత పిటిషన్ల కొట్టివేత**

ఎమ్మెల్యేలు  దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టివేశారు. పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ ప్రకటించారు.

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు.  ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలు పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ ప్రకటించారు. అనంతరం, ఇద్దరిపై వేసిన రెండు పిటిషన్లకు డిస్మిస్ చేశారు. దీంతో వారికి ఉపశమనం కలిగింది. సుప్రీంకోర్టు విధించిన గడువు ప్రకారం మార్చి 12వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, గతంలో ఎనిమిది మందికి ఇచ్చిన క్లీన్ చిట్ తరహాలోనే తాజాగా వీరికి కూడా ఊరటనిచ్చారు. దీంతో మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడదనే స్పష్టత వచ్చింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఈ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నేతలు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**బైట్ – దానం నాగేందర్**

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------------

**కేటీఆర్**

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇవ్వడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ నిర్ణయం ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడని అభివర్ణించారు. కాంగ్రెస్ అభ్యర్థులపై పోటీ చేసి గెలిచిన వారికే ఇప్పుడు క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజల తీర్పును అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించేలా ఉన్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజు అని ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారి ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, ఇలాంటి చర్యలు వ్యవస్థలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో ఖచ్చితంగా సమాధానం చెబుతారని హెచ్చరించారు.

**డెస్క్**

-----------------------------------

**జాతీయ లోక్ అదాలత్**

ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ కాదగిన కేసులను పరిష్కారానికి కృషి చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా మొదటి అదనపు ప్రధాన న్యాయమూర్తి ఎస్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గద్వాల్ కోర్టు ఆవరణంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గం అన్నారు. కాక్షికదారులు కోర్టుల చుట్టూ తిరిగే డబ్బు సమయాన్ని వృధా చేసుకోకుండా రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.వి.హెచ్ పూజిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్,అదనపు ఎస్పీ శంకర్, భవాని పాల్గొన్నారు.

**పీటీసీ – జోగులాంబ గద్వాల**

---------------------------

**కావూరి సాంబశివరావు**

మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత కావూరి సాంబశివరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ రోజు మరణించారు. ఆయన మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**డెస్క్**

-----------------------------------

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - గద్వాల**

జోగులాంబ గద్వాల జిల్లా లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయంగా నిర్వహించేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై నిన్న హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు కౌన్సిలర్లకు పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగేందుకు 99 రోజుల ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

**పీటీసీ – జోగులాంబ గద్వాల**

-----------------------------------

**జాతీయ ధూమపాన నిరోధక దినోత్సవం**

పట్టుదలతో ప్రయత్నిస్తే స్మోకింగ్ మానేయవచ్చునని, స్మోకింగ్ కు అడిక్షన్ అయినవారికి హెల్ప్ చేయడానికి డి అడిక్షన్ సెంటర్లు ఉన్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి చెప్పారు. జాతీయ ధూమపాన నిరోధక దినోత్సవం సందర్భంగా ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ.....

**బైట్ - డాక్టర్ దీప్తి**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------------------

**పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ ప్రజలకు గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు గురిచేస్తున్న డంప్ యార్డ్ చెత్త ను తొలగించేందుకు సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ వద్ద గల డంపింగ్ యార్డ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.....

**బైట్ - పొన్నం ప్రభాకర్**

**పీటీసీ - కరీంనగర్**

------------------------------

**మహిళల హాకీ ప్రపంచకప్**

మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా భారత్ ఇవాళ వేల్స్‌తో తలపడనుంది. ప్రస్తుతం పూల్-బిలో రెండు మ్యాచ్‌లకు గాను నాలుగు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

**డెస్క్**

----------------------------------